Telugu Bhakti Pages

**www.telugubhakti.com**

**Printer friendly version**

**Join Telugu Bhakti Pages group to get updates/ to participate in Dharmic discussions and to share thrilling religious views and divine experiences.**

**Click http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/**

# నారాయణ స్తోత్రమ్

నారాయణ ! నారాయణ ! జయగోవింద ! హరే !
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే !

సముద్రమున వసించువాడా, ఇరువది నాలుగు తత్వములు కలవాడా, సగుణ నిర్గుణస్వరూపముకలవాడా, సృష్టికర్తృత్వము సంహారకర్తృత్వము స్వీకరించినవాడా, స్వామీ! నారాయణ ! గోపాల ! నీకు జయము.

కరుణా పారావార ! వరుణాలయ గంభీర ! ।
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

ఓ దయాసముద్రుడా, గంభీరసముద్రుడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

ఘన నీరద సంకాశ ! కృతకలికల్మషనాశ ! ।
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

నల్లటిదట్టమైన మబ్బువంటి శరీరము కలవాడా, కలికాలమున చేసే పాపములను నాశనముచేయువాడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

యమునా తీరవిహార ! ధృతకౌస్తుభ మణిహార! ।
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

యమునానదితీరాన గోగోపికలతో విహరించేవాడా, కౌస్తుభమణిహార మును ధరించేవాడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

పీతాంబర పరిధాన! సురకళ్యాణ నిధాన! ।
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

బంగారు పట్టువస్త్రములు ధరించినవాడా, సురకళ్యాణానికి నిధివి, అట్టి స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

మంజులగుంజాభూష మాయా మానుష! ।
నారాయణ ! నారాయణ ! జయగోపాల! హరే ॥

మాయామానుషవేషధారి, మనోహరమైన గురివిందపూసలను దండగా ధరించినవాడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

రాధాధరమధురసిక ! రజనీచరకులతిలక ! ।
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

రాధాదేవి అధరమాధుర్యమును గ్రోలినవాడా, చంద్రవంశమునకు అలం కారమైనవాడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

మురళీగాన వినోద ! వేదస్తుత భూపాద! ।
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

మురళీగానముతో వినోదించువాడా, భూమి పాదములు, గగనము శిరస్సు అని వేదములచే కొనియాడబడేవాడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

బార్హిణబరహాపీడ ! నటనాటక ! ఫణిపీడ !
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

కిరీటమున తురాయిగా నెమలిపింఛమును ధరించినవాడా, నటుని వలె నటించుచు, కాళియసర్పము నణచినవాడా, స్వామీ ! నారాయణ ! గోపాల ! నీకు జయము.

వారిజ భూషాభరణ ! రాజీవ రుక్మిణీరమణ! ।
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

నీటబుట్టిన శంఖమును ఆభరణముగా కలవాడా, లక్ష్మీ అవతారమైన రుక్మిణీదేవిని ఆనందపరచువాడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

జలరుహదళనిభనేత్ర! జగదారంభక సూత్ర!
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

తామరరేకులవంటి కన్నులుగల వాడా, జగన్నాటక సూత్రధారి, స్వామీ! ఓ నారాయణ! గోపాల! నీకు జయము.

పాతకరజనీ సంహర ! కరుణాలయ ! మాముద్ధర !
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

పాపమనెడి కాళరాత్రిని సంహరించు వాడా, నీవు దయాసముద్రుడవు, నన్నుద్ధరించుము. ఓ స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

అఘబకక్షయ ! కంసారే ! కేశవ ! కృష్ణ ! మురారే !
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

ఓ గోపాల!  పాపాత్ములైన బకుడు కంసుడు మురుడు మొదలైన రాక్షసులను సంహరించినవాడా ! స్వామీ! అందమైన కేశములతో అందరినీ ఆకర్షించు స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

హాటక నిభపీతాంబర ! అభయం కురుమే మావర !
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

బంగారమువంటి పట్టుపీతాంబరములు ధరించినవాడా, నాకభయమొసంగుము స్వామీ! హే! నారాయణ! గోపాల! నీకు జయము.

గోవర్ధనగిరి రమణ ! గోపీ మానస హరణ ! ।
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

దేవేంద్రుని గర్వభంగముచేయనెంచి పసివాడుగానే గోవర్ధనమునెత్తి గోగోపజనమును కాపాడి వారి మనములనాకర్షించిన స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

దశరథరాజ కుమార! దానవమద సంహార !।
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

దశరథరాజతనయా, దానవసంహారా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

సరయూ తీరవిహార! సజ్జన ముని మందార!
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

సరయూతీరవిహారా, సజ్జనమునులకోర్కెలను దీర్చు స్వభావము కల వాడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

విశ్వామిత్ర మఖత్ర! వివిధ పరాసు చరిత్ర !।
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

విశ్వామిత్రుని యజ్ఞమును సంరక్షించినవాడా, మృతులనుసైతము బ్రతికించిన చరిత్రకలవాడా,  స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

ధ్వజ వజ్రాంకుశపాద ! ధరణీజని సహమోద !।
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

ధ్వజము వజ్రము అంకుశము మొదలగు ఉత్తమ రేఖలతో ఉత్తమ సాముద్రిక లక్షణములతో నొప్పపాదములుగల స్వామీ! సీతాదేవితో నిత్యానందమునొందు స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

జనకసుతాప్రతిపాల ! జయ జయ సంస్మృత లీల !।
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

సీతాదేవిని పాలించువాడా, నీ లీలలు సదా ఎల్లరు తలచుకొంటూం
టూరు. స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

దశరథ వాగ్ధృతభార ! దండక వనసంచార ! ।
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

తండ్రియగు దశరథుని మాటను శిరసావహించినవాడా, దండకారణ్య
మున సంచరించినవాడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

ముష్టిక చాణూర సంహార ముని మానస సువిహార !
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

చాణూర ముష్టికులనే దుష్టమల్లులను సంహరించి ముని మానసము
ల కానందమును కూర్చినవాడా,  స్వామీ! నారాయణ! గోపాల! నీకు
జయము.

వాలి వినిగ్రహ శౌర్య! వసుగ్రీవ హితార్య
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

వాలిని వధించిన శూరుడా, శరణు జొచ్చిన సుగ్రీవుని ఆదరించిన
ఓ రామా!  స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

మాం మురళీకర ! ధీవర! పాలయపాలయ శ్రీధర!
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

మురళీధరా, ధీవరా, శ్రీధరా నన్ను కాపాడుము, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

జలనిధి బంధన ధీర ! రావణ కంఠవిదార !
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

సముద్రమునకు వంతెన కట్టిన ధీరుడా! రావణుని కంఠములను నరికి ప్రోవులు చేసినవాడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

తాళీవన దళనాఢ్య ! నటగుణ ! వివిధధనాఢ్య !
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

గర్దభాసురుని సంహరించి తాటితోపును ధ్వంసము చేసి మాయామానుషత్వమును నటించుచు వివిధములైన సంపదలతో విరాజిల్లువాడా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

గౌతమ పత్ని పూజన కరుణా ఘనాఽవలోకన !
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

గౌతమపత్నిచే పూజలనందుకొన్నవాడా, గొప్పకరుణతోనిండిన చూపులతో ఆమెను ఉద్ధరించినవాడా, స్వామీ ! నారాయణ ! గోపాల ! నీకు జయము.

సంభ్రమ సీతాహార ! సాకేత పుర విహార !
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

గొప్పసంభ్రమపరాక్రమములతో శత్రువుని జయించి సీతను తీసుకుని వచ్చి సాకేతపురమున పట్టాభిషిక్తుడవై విహరించిన ఓ రామా,  స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

అచలోద్ధృతి చంచత్కర ! భక్తాను గ్రహతత్పర !
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

చిటికనవ్రేలితో గోవర్ధనపర్వతమునెత్తిన వాడా, భక్తులననుగ్రహించుటలో తదేకనిష్ఠ కలవాడా,  స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

నైగమగానవినోద ! రక్షస్సుతప్రహ్లాద!
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

నిన్నుగురించి వేదములు చేయునట్టి గానమున వినోదించువాడా, హిరణ్యకశిపునిసుతుడైన ప్రహ్లాదుని ఆనందింపచేయు కళ్యాణగుణా, స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

భారతయతివర శంకర నానామృత వచనాంతర !
నారాయణ ! నారాయణ ! జయగోపాల ! హరే ॥

భారతదేశమున యతి శ్రేష్ఠుడైన శంకరాచార్యుని అమృత ప్రాయములైన వివిధస్తుతులతో నిండియున్న సగుణ నిర్గుణ స్వరూపముగలవాడా ఓ స్వామీ! నారాయణ! గోపాల! నీకు జయము.

ఇది శ్రీ శంకరాచార్య విరచిత నారాయణ స్తోత్రము.